క్లుప్తంగా

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి సత్యనారాయణ సూచించారు. శనివారం మండలంలోని బాబాపూర్, తేలిగూడ ప్రభుత్వ పాఠశాలలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తొలిమెట్టు ద్వారా విద్యార్థులు సాధించిన ప్రగతి, సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు



పనులు పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

రెబ్బెన: మండలంలో పదో తరగతి పరీక్షల కోసం పరీక్ష కేంద్రాల్లో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈవో వెంకటేశ్వర స్వామి, ఎంపీడీవో శ్రీనివాస్‌లు అన్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలను దృష్టిలో పెట్టుకుని మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం శానిటేషన్ పనులు చేపట్టారు. పాఠశాల పరిసరాలను శుభ్రం చేసి చెత్తాచెదారాన్ని ఎత్తివేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మేడి చరణ్‌దాస్, ఎంపీవో అంజద్‌పాషా, ఉపాధ్యాయులు అనీస్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: బీజేపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పద్మజా లక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని ఎల్లారం, దస్నాపూర్, ఆడ గ్రామాల్లోని అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ఇస్తున్న నిధులతో అభివృద్ధి చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అందిస్తుందని, కాని వాటిని బీఆర్ఎస్ ఇస్తున్నట్లు చెప్పుకుంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు వందన, పంచాయతీ కార్యదర్శి మురళి, శ్రీశైలం, గణేష్ తదితరులు ఉన్నారు.

ఆలయానికి ఫ్యాన్లు అందజేత



ఫ్యాన్లు అందజేస్తున్న ప్రణయ్

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బూర్గుడ పంచముఖీ ఆంజనేయ దేవాలయానికి శనివారం యువ నాయకుడు అవిడపు ప్రణయ్ ఫ్యాన్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని సూచించారు. భక్తులు నాగరాజు, ప్రశాంత్, సాగర్ తదితరులు ఉన్నారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం	: దసరా

కాగజ్‌నగర్

వెంకటరమణ	: దసరా

- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.20
సిమ్లామిర్చి	80
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	60
కాకరకాయ	60
బెండకాయ	60
అలసంద	40
దొండకాయ	60
పచ్చిమిర్చి	50
పాలకూర	60
సొరకాయ	60
చిక్కుడు కాయ	30
గోబి(పూల్)	40
క్యాబేజ	40

-ఆసిఫాబాద్‌అర్బన్

ఇన్‌చార్జీల పాలనతో ఇక్కట్లు

- రెగ్యులర్ అధికారులు కరువు
- మండలానికి దూరంగా ఇన్‌చార్జీలు
- పని ఒత్తిడితో సతమతం



చింతలమానెపల్లి మండల కేంద్రం

చింతలమానెపల్లి: గ్రామీణ మండలాల అభివృద్ధికి పాటు పడుతున్నామని ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో మాత్రం కార్యరూపం దాల్చడం లేదు. ప్రధాన శాఖలకు కార్యాలయాలు, అధికారులు లేక మండల వాసులకు అవస్థలు తప్పడం లేదు. ఓ వైపు మండల అభివృద్ధి కుంటుపడుతుండగా మరోవైపు ఇన్‌చార్జి అధికారులు పని భారంతో ఒత్తిడికి గురవుతున్నారు.

2016లో ఏర్పాటు..

చింతలమానెపల్లి మండలం 2016లో ఏర్పాటు కాగా 19 గ్రామపంచాయతీలు, 26 గ్రామాలు మండలంలో ఉన్నాయి. స్థానికంగా ఉన్న పాఠశాల భవనాల్లో తాత్కాలికంగా పోలీస్‌స్టేషన్, రెవెన్యూ కార్యాలయాలను ప్రారంభించి ప్రభుత్వ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. నూతనంగా మండలం ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు మండల వాసులకు పూర్తిస్థాయి ప్రభుత్వ సేవలు అందడం లేదు. రెవెన్యూ, మండల పరిషత్, పోలీస్ మినహాయిస్తే ప్రధాన శాఖలకు కార్యాలయాలు లేకపోగా రెగ్యులర్ అధికారుల నియామకం కూడా చేపట్టడం లేదు.

అస్తవ్యస్తంగా పలు శాఖలు..

మండలంలో ప్రధానంగా వ్యవసాయంపైనే ప్రజలు ఎక్కువగా ఆధారపడి ఉన్నారు. కాగా ఇప్పటి వరకు మండలంలో వ్యవసాయశాఖ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు చేపట్టలేదు. మండలానికి వ్యవసాయ అధికారిని సైతం నియమించలేదు. గతంలో కౌటాల వ్యవసాయ అధికారిగా ఉన్న రాజేష్‌ను మండలానికి ఇన్‌చార్జిగా నియమించారు. అయితే ఆయన తీవ్ర పని ఒత్తిడి కారణంగా మండల ఇన్‌చార్జిగా విధుల నుంచి తప్పుకున్నారు. అనంతరం కాగజ్‌నగర్ వ్యవసాయ అధికారి రామకృష్ణకు మండల ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. అయితే కాగజ్‌నగర్ నుంచి చింతలమానెపల్లి సుమారు 50కిలోమీటర్ల దూరంలో ఉండగా కాగజ్‌నగర్ వ్యవసాయ అధికారి మండలవాసులకు అందుబాటులో ఉండడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. విద్యాశాఖలో మండల ఇన్‌చార్జిగా కౌటాల ఎంఈవో సోమయ్యను నియమించారు. అయితే ఆయన ఇప్పటికే పలు మండలాలకు ఇన్‌చార్జిగా అదనపు బాధ్యతలు చేపట్టారు. మండలంలో రవీంద్రనగర్- బాబాపూర్, గంగాపూర్, చింతలమానెపల్లి, బాబాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఇన్‌చార్జీలే ప్రధానోపాధ్యాయులుగా ఉన్నారు. ఎంఆర్‌సీ కార్యాలయం సైతం మండల కేంద్రంలో లేకపోవడంతో విద్యాశాఖ సంబంధిత సేవల కోసం కౌటాల మండల కేంద్రానికి మండల వాసులు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

అందని పశువైద్యం..

మండలంలో పశువులకు వైద్యం అందించేందుకు డబ్బా గ్రామంలో పశువైద్య కేంద్రం, రవీంద్రనగర్‌లో పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నాయి. కాగా డబ్బా పశువైద్యశాలలో వైద్యాధికారిగా ఉన్న రాధిక దీర్ఘకాలికంగా సెలవులో ఉన్నారు. కొద్ది నెలల క్రితం కౌటాల పశువైద్యాధికారి శ్రీకాంత్‌ను ఇన్‌చార్జీగా నియమించారు. మండల కేంద్రంలో కార్యాలయం లేకపోగా పశువైద్య సేవలకు పొరుగు మండలాలు బెజ్జూర్, కౌటాలపై రైతులు ఆధారపడుతున్నారు.

పూర్తిస్థాయి అధికారులు ఇంకెప్పుడు..?

కొత్త మండలం ఏర్పాటై ఏళ్లు గడుస్తున్నా అధికారులను నియమించక పోవడంపై మండల వాసుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రధాన శాఖలకు అధికారులు లేని కారణంగా పాలన సైతం గాడి తప్పుతోంది. మరోవైపు ప్రభుత్వ సేవలకు పొరుగు మండలాలకు ప్రజలు వెళ్తున్నారు. ప్రజల ఇబ్బందులు తొలిగేలా చర్యలు తీసుకొని మండలంలోని అన్ని శాఖలకు సంబంధించిన కార్యాలయాలను మండలంలో ఏర్పాటు చేయాలని, పూర్తిస్థాయి అధికారులను వెంటనే నియమించాలని మండలవాసులు కోరుతున్నారు.

విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రభుత్వ పథకాల అమలు, మండల అభివృద్ధిలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావ్ అన్నారు. ప్రతీ 15 రోజులకోసారి నిర్వహించే సమీక్షా సమావేశంలో భాగంగా శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మల్లిఖార్జున్ అధ్యతన విద్యుత్, మిషన్ భగీరథ, అంగన్‌వాడీ, ఐకేపీ శాఖలపై నిర్వహించిన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్‌శాఖ ఏఈ రవీందర్ సమావేశాలకు హాజరు కాకపోవడం, సమస్యలు పరిష్కారం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అధికారిని సరేండర్ చేసేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. వేసవికాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. మిషన్ భగీరథలో ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. రౌటసంకెపల్లిలోని ధాన్ ఫౌండేషన్ వ్యవహారాలపై సోమవారం విచారణ చేస్తామని తెలిపారు. విద్యుత్ కోతలు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లేష్, ఎంపీడీవో శశికళ, సర్పంచ్‌లు భీమేష్, దినకర్, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌అర్బన్: మాట్లాడుతున్న జెడ్పీటీసీ



కౌటాలలో పూర్ణిమకు సన్మానం చేస్తున్న సిబ్బంది

మండల అభివృద్ధికి పాటుపడాలి

కౌటాల: అధికారులు, ప్రజాప్రతినిధులు మండల అభివృద్ధికి పాటుపడాలని ఎంపీపీ బసర్కార్ విశ్వనాథ్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈజీఎస్ శాఖ నివేదికలను ఏపీవో పూర్ణిమ సభ్యులకు చదివి వినిపించారు. పని ప్రదేశాల్లో కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని సభ్యులు కోరారు. అనంతరం పలు శాఖల అధికారులు తమ నివేదికలు చదివి వినిపించారు. గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ప్రజాసమస్యలు చర్చించాల్సిన సమీక్ష సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు గైర్హాజరవడం సరికాదన్నారు. గైర్హాజరైన అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ఆయన ఎంపీడీవోకు సూచించారు. ఉత్తమ సేవలు అందించినందుకు ఈజీఎస్ ఏపీవో పూర్ణిమకు దీన్ దయాల్ ఉపాధ్యాయ అవార్డు రావడంతో ఆమెను సన్మానించారు. సమావేశంలో ఎంపీడీవో నస్రుల్లాఖాన్, ఎంపీవో మౌనిక, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శంకర్ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవికాలంలో తాగునీటి సమస్య ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో గౌరీశంకర్ సూచించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. సమావేశంలో జిల్లా కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

పెంచికల్‌పేట్: మండలంలోని కమ్మర్‌గాం ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎస్సై విజయ్‌కుమార్ శనివారం పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా హాజరు కావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెంచికల్‌పేట్: పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న ఎస్సై

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలోని డబ్బా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం 10వ తరగతి విద్యార్థులకు శివరామసాయి యూత్ ఆధ్వర్యంలో పరీక్ష కిట్లను అందజేశారు. తరగతిలోని 22మంది విద్యార్థులకు జామెట్రీ బాక్స్, పెన్నులు, ప్యాడ్లను అందజేశారు. శివరామసాయి యూత్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గుర్లె శ్రీనివాస్, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ఎద్దు ప్రకాష్, యూత్ సభ్యులు వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్ మండలంలో..

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులు ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయాలని సీఐ నాగరాజు, ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ అన్నారు. శనివారం మండలంలోని నజ్రూల్ నగర్ విలేజ్ నం.5, విలేజ్ నం .12 గ్రామ పాఠశాలల 72 మంది విద్యార్థులకు, గన్నారం జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 76 మంది విద్యార్థులకు ప్యాడ్లు, పెన్సిళ్లు, పెన్నులు అందజేశారు. వారు మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు పౌష్టికాహారం తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కౌటాల: ప్రతీ ఒక్కరు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షకీరాబేగం అన్నారు. పోషణ్ మాసోత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పోషకాహారంపై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

దహెగాం: మండలంలోని బీబ్రా, గెర్రె గ్రామాల్లో శనివారం గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచులు పుష్పాల లక్ష్మి, కృష్ణమూర్తి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కాగజ్‌నగర్‌టౌన్: అరబీ, ఉర్దూ భాషలతో పాటు ఇతర భాషల్లోనూ విద్యార్థులు ప్రతిభ కనబర్చాలని, కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జమీయతుల్ ఉలేమా ఏ హింద్ సిర్పూర్ తాలుకా అధ్యక్షుడు మౌలానా ముబీన్ పిలుపునిచ్చారు. శనివారం కాగజ్‌నగర్ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఖురాన్ పఠనాన్ని (శిక్షణ) పూర్తి చేసుకున్న 15 మంది విద్యార్థులను పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ దేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకొని విద్యార్థులు క్రమశిక్షణతో ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో మైనార్టీ మత పెద్దలు మసూద్ అలీఖాన్, హఫీజ్ మునర్వర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



ఖురాన్ పఠనం పూర్తి చేసిన విద్యార్థులతో మత పెద్దలు

ఉపాధి పనులు పకడ్బందీగా చేపట్టాలి

బజార్‌హత్నూర్: ఉపాధిహామీ పనులను పకడ్బందీగా చేపట్టాలని కమిషన్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ప్రత్యేకాధికారి ఎస్‌పీఎం కృష్ణమూర్తి అన్నారు. శనివారం మండలంలోని భూతాయి, చందునాయక్‌తండా, బజార్‌హత్నూర్‌లలో ఇరిగేషన్ కాలువలు, నర్సరీలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. నర్సరీలో మొక్కల పెంపకం, కాలువల పూడికతీత పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీడీ కృష్ణరావ్, ఎంపీడీవో కృష్ణరావ్, ఈజీఎస్ ఏపీఎం శ్రీనివాస్, సర్పంచులు లావణ్య, అనిత, పంచాయతీ కార్యదర్శులు సునీల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

షీటీంపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్: మహిళలకు షీటీం అండగా ఉంటుందని షీటీం సభ్యురాలు సునీత అన్నారు. శనివారం మండలంలోని బాబాపూర్‌లో గల మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులకు షీటీంపై అవగాహన కల్పించారు. షీటీం సభ్యులు పుష్పలత, స్వప్న తదితరులు ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి ఏర్పాట్లు పూర్తి చేయాలి

రెబ్బెన: ఈనెల 7న మండల కేంద్రంలోని కేకే గార్డెన్స్‌లో ఏర్పాటు చేయనున్న బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కులు అన్నారు. శనివారం సమ్మేళన సభ స్థలాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులు ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యేలా చూడాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ మహేష్‌గౌడ్, సర్పంచులు అహల్యాదేవి, పోషమల్లు, ఎంపీటీసీ మధునయ్య, నాయకులు విమలేష్, శ్రీధర్, నవీన్‌జైస్వాల్, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు అరుణ, జిల్లా నాయకురాలు శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ కార్యకర్తను కాపాడుకుంటాం

బీఆర్ఎస్ పార్టీలోని ప్రతీ కార్యకర్తను కంటికి రెప్పలా కాపాడుకుంటామని జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. మండల కేంద్రానికి చెందిన పార్టీ సీనియర్ కార్యకర్త వినోద్‌జైస్వాల్ జన్మదిన వేడుకలను గంగాపూర్ బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించగా వారు హాజరయ్యారు.

సామాజిక సేవలో యువసేన ఆదర్శం

సామాజిక సేవ కార్యక్రమాల్లో దేవార వినోద్ యువసేన్ చారిటబుల్ ట్రస్ట్ నేటి తరం యువతకు ఆదర్శప్రాయమని జెడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కులు అన్నారు. దేవార వినోద్ యువసేన ఆధ్వర్యంలో ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కార్యక్రమాన్ని శనివారం మండల కేంద్రంలో ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కరోనా లాక్‌డౌన్ సమయంలో ఎంతోమంది ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలకు కడుపు నిండా అన్నం పెట్టడంతో పాటు వేసవిలో వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చే ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన అంబలి పంపిణీ కార్యక్రమాలు ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, సర్పంచ్ అహల్యాదేవి, ఎంపీటీసీ పెసరు మధునయ్య, యువసేన ట్రస్ట్ వ్యవస్థాపకుడు దేవార వినోద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్ రెడ్డి, తహసీల్దార్ మల్లికార్జున్, సీఐ అల్లం నరేందర్, ఎస్సై భూమేష్, ఎంపీడీవో శ్రీనివాస్, నాయకులు గుంపుల విమలేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు

భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్‌టౌన్: భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు, మేస్త్రీల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హామీ ఇచ్చారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కార్మికులకు ఏ ఆపద వచ్చినా తన వద్దకు రావాలని వారిని అన్ని విధాల ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. భవన నిర్మాణ కార్మికుల భవనం కోసం రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. మేస్త్రీలు, కార్మికులు కార్మిక శాఖ అందించే గుర్తింపు కార్డులు తప్పకుండా పొందాలని పేర్కొన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి అభివృద్ధి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో తాపీ, టైల్స్, పెయింటింగ్, ప్లంబింగ్, సెంట్రింగ్, ఎలక్ట్రికల్ రంగ కార్మికులు, మేస్త్రీలు పాల్గొన్నారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనప్ప

కాలినడకన కొండగట్టుకు పయనం

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అందవెల్లి గ్రామానికి చెందిన 20మంది అంజన్న దీక్షాపరులు శనివారం కాలినడకన కొండగట్టుకు బయలుదేరి వెళ్లారు. గ్రామసమీపంలోని పెద్దవాగులో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం గురుస్వామి సదాశివ్ ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభించారు. పాదయాత్ర గూడెం, ధర్మపురి పుణ్యక్షేత్రాల మీదుగా కొండగట్టుకు చేరుతుందని వారు పేర్కొన్నారు.



కొండగట్టుకు బయలుదేరిన అంజన్న దీక్షాపరులు

హనుమాన్ మందిరంలో పూజలు

కౌటాల: మండలంలోని సైదాపూర్ గ్రామంలో గల హనుమాన్ ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ 16వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

'జయంతి విజయవంతం చేయాలి'

ఆసిఫాబాద్‌రూరల్: హనుమాన్ జయంతిని విజయవంతం చేయాలని జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని కేస్లాపూర్ హనుమాన్ మందిరంలో హనుమాన్ దీక్షస్వాములతో కలిసి హనుమాన్ జయంతి కరపత్రాలు ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆదివారం ఉదయం నుంచి జిల్లా కేంద్రంలో హనుమాన్ శోభాయాత్రలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శిరీష్ శర్మ, స్వాములు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవన నిర్మాణానికి భూమిపూజ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి గ్రామంలో శనివారం అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు భూమిపూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు వేగవంతంగా చేయడంతో పాటు నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శంకర్, ఐసీడీఎస్ సీడీపీవో సురేఖ, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు సిద్దిక్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మణ్, పీఏసీఎస్ డైరెక్టర్ రాములు, సర్పంచ్ పద్మకిషన్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వాసుదేవ్, నాయకులు కొండయ్య, గణేష్, రాజన్న, పెంటయ్య, రవి, అంగన్‌వాడీ టీచర్ సత్తమ్మ, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్ కృష్ణారావు

మహనీయుల జయంతి ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ హేమంత్ బోర్కడే

ఆసిఫాబాద్: మహనీయుల జయంతి ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. ఈ నెల 5న బాబుజగ్జీవన్‌రాం, 14న అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం అదనపు కలెక్టర్ రాజేశంతో కలిసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. బాబు జగ్జీవన్ రాం, అంబేద్కర్ జయంతి కార్యక్రమాలు జిల్లాలో ఘనంగా నిర్వహించాలని, ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఒడ్డేపెల్లి గార్డెన్‌లో, కాగజ్‌నగర్ పట్టణంలో వేడుకలు నిర్వహించేందుకు సంబంధిత అధికారులు, నిర్వాహకులు సమన్వయంతో పని చేయాలన్నారు. ఇందుకోసం అవసరమున్న అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని తెలిపారు. సమావేశంలో ఆర్డీవో రాజేశ్వర్, ఎస్సీ కార్పొరేసన్ అధికారి సజీవన్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రేగుంట కేశవరావు, మాహోర్కర్ అశోక్, గంగుబాయి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు